# ఒక భారతీయుడిగా గర్వపడుతున్నా..

**ముస్లిం మైనార్టీ మోర్చా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సలీం ఖురేషి**

- పహల్గాం దాడికి ఇదే సరైన ప్రతికారం
- ఉగ్రవాదులను హతమార్చడం భారత్ గర్వించదగ్గ విషయం
- మోడీ ప్రధానమంత్రి కావడం దేశప్రజల పూర్వజన్మ సుకృతం
- ముస్లిం మైనార్టీ మోర్చా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సలీం ఖురేషి



**కొత్తగూడెం, మే07(కెరటం న్యూస్)**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో దేశ ప్రజలపై జరిగిన దాడికి పాకిస్తాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను తుదముట్టించడం సరైన ప్రతికారమని, 75 మంది ఉగ్రవాదులను హతమార్చడం యావత్ భారతదేశం గర్వించదగ్గ విషయమని, సైనిక పాటవానికి ఒక భారతీయుడిగా గర్వపడుతున్నానని, మోడీ ప్రధానమంత్రి కావడం దేశప్రజల పూర్వజన్మ సుకృతమని బిజెపి పార్టీ ముస్లిం మైనార్టీ మోర్చా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సలీం ఖురేషి అన్నారు. ఉగ్రవాదులను హతమార్చడంపై సలీం ఖురేషి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. భారత్ సైతం 75 మంది ఉగ్రవాదులను హతమార్చడం నిజంగా భారతదేశం గర్వించదగ్గ విషయమన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల గుండెల్లో సింహ స్వప్నంలా తుద ముట్టిస్తున్న మన భారత ప్రధాని, ధైర్యశాలి అన్నారు. యావత్ భారతావని ప్రధాని మోడీకి రుణపడి ఉంటుందని, భారతదేశానికి ప్రధానమంత్రి కావడం దేశ ప్రజల పూర్వజన్మ సుకృతమన్నారు. పహల్గాం దాడికి ఇదే సరైన ప్రతికారమని, మన సైన్యం ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం గర్వకారణమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాకిస్తాన్‌లోని ఉగ్ర శిబిరాలు, మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించాలని పేర్కొన్నారు. ఉగ్రవాదం అంతం కావాల్సిందేనని, భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడిగా నేను గర్వపడుతున్నానని తెలిపారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా.. ఏ దేశంలో ఉన్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేది కాదని, ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయన్నారు. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశరక్షణలో మేమెవరికి తీసిపోం అన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని కోరారు.

# సమిష్టిగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి

- ఎర్ర జెండానే పేదవర్గాల అండ
- కూనంనేని కృషితో బ్రిడ్జి, రోడ్ల నిర్మాణానికి రూ.6.32కోట్లు మంజూరు
- పెనుబల్లి గ్రామ సిపిఐ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**కొత్తగూడెం, మే07(కెరటం న్యూస్)**

గ్రామీణ ప్రజలు రాజకీయాలకు అతీతంగా సమిష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి గ్రామాన్ని సిపిఐ ప్రతినిధిబృందం బుధవారం సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు.

ఎర్ర జెండానే పేదవర్గాలకు, గ్రామీణ ప్రజలకు అండగా ఉంటుందని, సమస్యలను గుర్తించి వాటి పరిస్కారం కోసం కృషి చేస్తుందన్నారు. పెనుబల్లి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన రహదారి సమస్యను గుర్తించిన స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పెనుబల్లి బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ. 6కోట్లు మంజూరు చేశారని, అదేవిధంగా గ్రామంలో రూ. 32లక్షల వ్యయంతో అంతర్గత రహదారులు, డ్రైన్లు నిర్మించడం జరిగిందన్నారు. పెనుబల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయించి 150మంది ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. సమస్యలను గుర్తించి వాటి పరిస్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టు కార్యకర్తలపై ఉందని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, కిలారు ప్రసాద్, భవాని, ఇనుములా నర్సింహా రావు, బి భాస్కర్, బి కిరణ్, శరభ చారి, ఈ శ్రీను మురళి, పశయ్య, వెంకన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# దెబ్బకి దెబ్బ తీసిన భారత సైనికులకు నా సెల్యూట్

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి**



**కొత్తగూడెం, మే07(కెరటం న్యూస్)**

భారత ఆర్మీ అమలు చేసిన ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్‌లో ఉన్న 9 ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం భారత ప్రజలందరికీ గర్వకారణమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి అన్నారు. దేశాన్ని కాపాడేందుకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న మన భారత ఆర్మీ జవాన్లకు ఆయన హృదయ పూర్వక అభినందనలు తెలిపి వారికి ఘనంగా సెల్యూట్ తెలిపారు. మన దేశ ఆర్మీ తలుచుకుంటే పాకిస్తాన్‌ను చీమల మాదిరిగా నలిపేయగలదన్న విషయాన్ని ఈ ఆపరేషన్ ద్వారా దేశ శత్రువులకు స్పష్టమైన సందేశం ఇచ్చిందన్నారు. ఏనాడు అనవసరంగా భారతదేశం వేరే దేశాలపైకి దాడి చేయలేదని, అదే సమయంలో మన దేశంలో అమాయకుల పట్ల ముష్కరులు చేసే దాడులకు ధీటైన సమాధానం ఇవ్వడంలో వెనుకడుగు వేయదన్నారు. భారతదేశం మౌనంగా ఉందంటే అది బలహీనత కాదని మన సహనమన్నారు. పహల్గాం లాంటి ఘటనలు మళ్లీ తలెత్తే పరిస్థితి వస్తే, ఈసారి భారతదేశ ఆర్మీ చేతిలో పాకిస్తాన్ బలి అవ్వక తప్పదన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద శిబిరాలకు ఇది గట్టి హెచ్చరిక అన్నారు.



# కుకింగ్ పోటీలో విజేతగా రీజెన్సీ కళాశాల

**హైదరాబాద్, మే07(కెరటం న్యూస్)**

యువ చెఫ్స్‌లో ఉన్న నైపుణ్యం, సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతో తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ (టీసీఏ) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టీసీఏ క్యులినరీ లీగ్ 2.0 పోటీలో రీజెన్సీ కళాశాల విజేతగా నిలిచింది. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో ఐదు ప్రత్యేక పోటీలు నిర్వహించారు. అవి.. వరంగల్ గ్లోబల్ కళాశాలలో మిల్లెట్ మానియా, నిజామాబాద్ ఇన్ఫినిటీ కళాశాలలో తెలంగాణ ఫుడ్ చాలెంజ్, కరీంనగర్ కిమ్స్ కళాశాలలో బిర్యానీ వెర్సస్ పులావ్, హైదరాబాద్ ఐఐహెచ్ఎంసీఏలో ది ఆర్ట్ ఆఫ్ ప్లేట్, హైదరాబాద్ రీజెన్సీ కళాశాలలో నియో తెలంగాణ నిర్వహించారు. ప్రతి విభాగంలో ఉత్తమంగా నిలిచిన రెండు బృందాలు గ్రాండ్ ఫినాలేకి అర్హత సాధించాయి. ఈ ఫినాలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ (ఐహెచ్ఎం–హైదరాబాద్) వేదికగా జరిగింది. ఇది కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర ప్రభుత్వ సంస్థ. ఈ పోటీ ద్వారా రాష్ట్రంలోని యువతలో వంటపై మక్కువ కలిగేలా చేయడం, స్థానిక వంటకాల ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది.

**'రైస్ కుకింగ్ ఛాలెంజ్' ఇది సృజనాత్మకతకు పరీక్ష**

ఈ గ్రాండ్ ఫినాలేలో పోటీదారులు గంటన్నర పాటు సాగిన 'రైస్ కుకింగ్ ఛాలెంజ్'లో తలపడ్డారు. ఈ పోటీలో పాల్గొన్న వారికి ముందుగా తెలియని పదార్థాలు ఇచ్చారు. ఆ పదార్థాలు ఉపయోగించి ఒక వంటకం తయారు చేయాలి. ఇది వారి సృజనాత్మకత, తక్షణ ఆలోచనశక్తి, వంట నైపుణ్యానికి సవాల్‌గా నిలిచింది. ఈ టీసీఏ క్యులినరీ లీగ్ 2.0 విజేతగా హైదరాబాద్‌కు చెందిన రీజెన్సీ కాలేజ్ ఆఫ్ క్యులినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్మెంట్ ఎంపికైంది. ఈ విజయం రీజెన్సీ కళాశాల యువ చెఫ్లలో ఉన్న ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెఫ్ ధర్మేందర్ లాంబా మాట్లాడుతూ ఇది తెలంగాణ వంట కళకు గర్వకారణం అన్నారు. ఇది ఒక పోటీ మాత్రమే కాదని, తెలంగాణలో ఉన్న స్థానిక వంటకాలను గుర్తించేందుకు, భవిష్యత్ చెఫ్లను ప్రోత్సహించేందుకు రూపుదిద్దుకున్న ఒక ఉద్యమంగా నిలిచిందన్నారు.